క్లుప్తంగా

ఇన్ సర్వీసు కోటా తగ్గింపుతో అన్యాయం



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ మౌనిక

రాజమహేంద్రవరం రూరల్: జీవోఎంఎస్ నం.99 ద్వారా పీహెచ్‌సీ వైద్యులకు ఇన్ సర్వీస్ పీజీ కోటా తగ్గించడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక అన్నారు. మంగళవారం కలెక్టర్‌తో పాటు, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావుకు సంఘ ప్రతినిధులతో కలిసి ఆమె వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న డాక్టర్లకు మంచి కెరీర్ అవకాశాలు ఉంటాయని, వారికి పీజీ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, తమతో చర్చించకుండా జీవో విడుదల చేయడం తమను వంచించడమేనన్నారు. గతేడాది ప్రభుత్వం ఇచ్చిన టైం బౌండ్ ప్రమోషన్లకు కమిటీ ఏర్పాటు, ట్రైబల్ అలవెన్స్ మంజూరు, నోషనల్ ఇంక్రిమెంట్లు, సంచార చికిత్స కార్యక్రమానికి అలవెన్స్ వంటి హామీలు ఇంకా నెరవేర్చలేదన్నారు. పనిభారం పెరుగుతున్నా, కఠిన పరిస్థితుల మధ్య ప్రజల ఆరోగ్యానికి కృషి చేస్తూనే ఉన్నామన్నారు. తమపై ప్రభుత్వం వివక్ష చూపించడం బాధాకరమన్నారు. జీవోఎంఎస్ నం.99 తక్షణమే రద్దు చేసి, ఇన్ సర్వీస్ పీజీ కోటా యథాతథంగా ఉంచాలని, అలవెన్సులన్నీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

30న స్ఫూర్తి సభ

రాజమహేంద్రవరం రూరల్: విజయవాడలో ఈ నెల 30న సంచార జాతుల స్ఫూర్తి సభ జరుగుతుందని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్ తెలిపారు. మంగళవారం కొంతమూరులో ఆయన ఆధ్వర్యంలో పలువురు నాయకులు సంచార జాతులకు చెందిన బేడబుడగ జంగాలు, లంబాడీ సామాజిక వర్గాల పెద్దలను కలిశారు. సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న స్ఫూర్తి సభకు ఆహ్వానించారు. సంచార జాతుల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు, ఇతర అంశాలపై చర్చిస్తారని చెప్పారు.

టీచర్ల సమస్యలపై నిరంతర పోరాటం



సత్యనారాయణరెడ్డిని సత్కరించిన సహచరులు

రాజానగరం: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించుకోవడం కోసం నిరంతర పోరాటం అవసరమని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పాతతుంగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. పీఆర్‌సీ ఇవ్వాలని, డీఏ బకాయిలు చెల్లించాలని, ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులపై పని ఒత్తిడిని తగ్గించాలని సంఘ పరంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం తప్పనిసరిగా ఉండాలన్నారు. 10వ తరగతి వరకు విద్యా బోధన తెలుగులో కూడా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర అధ్యక్షుడికి అభినందనలు

ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన ఎండీ సత్యనారాయణ రెడ్డిని పాతతుంగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కమలాదాస్, సహచరులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు.

ఎరువులు అందించాలని రైతుల ఆందోళన

కోరుకొండ: మెట్ట ప్రాంతంలో వ్యవసాయ సాగుకు ఎరువుల కొరత ఏర్పడింది. ఎరువులు సకాలంలో రైతులందరికీ అందించాలని రైతులు ఆందోళన చేపట్టారు. శ్రీరంగపట్నం సొసైటీలో ఎరువుల కొరతను నివారించాలని రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సొసైటీ పరిధిలో సుమారు 4 వేల మంది రైతులు 3,600 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో 80 టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటికి మూడు దఫాలుగా 30 టన్నులు మాత్రమే విడుదలైందన్నారు. మరో 60 టన్నులు యూరియా అవసరమవుతుందన్నారు. చాలిచాలన ఎరువులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రైతులకు ఎరువులు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎక్సైజ్ దాడులు

రంగంపేట: మర్రిపూడి, ఇల్లపల్లి గ్రామాల్లో సారా స్థావరాలపై మంగళవారం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది దాడులు చేశారు. సారా విక్రయిస్తున్న మర్రిపూడికి చెందిన అడ్డాల తాతాజీ, ఇల్లపల్లికి చెందిన ఈలి ముసలయ్యను అరెస్టు చేశారు. వారి నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.



కాతేరు ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద భారీ గొయ్యి



కాతేరులో చెరువు వద్ద ప్రమాదకరంగా..



గోతులమయంగా రాజవోలు రోడ్డు



కొంతమూరు ఎయిర్‌పోర్టు రోడ్డు ఇలా..

చిరుజల్లులు.. భారీ చిల్లులు

- మండలంలో రోడ్లకు అడుగడుగునా గోతులే..
- వాహన చోదకులకు తప్పని ఇక్కట్లు
- ప్రమాదాలకు గురై.. గాయాలపాలవుతున్న వైనం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్: అసలే నాణ్యత లేని మరమ్మతులు.. ఆపై కుండపోత వర్షాలు. ఇంకేముంది.. తూతూమంత్రంగా చేసిన మరమ్మతుల అసలు రంగు బయటపడుతోంది. రోడ్లను పటిష్ట పర్చేశామంటూ ఆర్భాటంగా 'పండగ' చేసుకున్న పాలకుల చిత్తశుద్ధి ఏపాటిదో క్రమంగా జనానికి ప్రస్ఫుటమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లపై ఉన్న గోతులన్నీ పూడ్చి పల్లె పండగ తెచ్చామని ప్రగల్భాలు పలికారు. కానీ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రాతినిధ్యం వహిస్తున్న రూరల్ నియోజకవర్గంలోని రాజమహేంద్రవరం రూరల్ మండలంలో ఏ గ్రామంలో.. ఏ రోడ్డు చూసినా అడుగడుగునా గోతులే దర్శనమిస్తున్నాయి. దీనివల్ల ప్రతి రోజూ వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో ఆ గోతుల్లో పడి ప్రయాణికులు గాయాల పాలవుతున్న సంఘటనలూ కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. అయినప్పటికీ పాలక యంత్రాంగంలో ఎటువంటి చలనం లేదు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.



గోతులతో అధ్వానంగా మారిన బొమ్మూరు-బాలాజీపేట రోడ్డు

కష్టాలు వర్ణనాతీతం

రాజమహేంద్రవరం రూరల్ మండలంలో కాతేరు గ్రామంలోని రోడ్డు, కొంతమూరు ఎయిర్‌పోర్టు రోడ్డు, బొమ్మూరు-బాలాజీపేట రోడ్డు, బొమ్మూరు-రాజవోలు రోడ్డు ఇలా ఏ రోడ్డు చూసినా గోతులు దర్శనమిస్తున్నాయి. ఆయా రోడ్లలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అధిక లోడుతో ఇసుక, గ్రావెల్ లారీలు యథేచ్ఛగా ప్రయాణిస్తున్నాయి. కాతేరు మల్లయ్యపేట వద్ద ఆ ప్రాంత ప్రజల కష్టాలు వర్ణనాతీతం. ప్రతి రోజూ భారీ వాహనాల రాకపోకల వల్ల మట్టి, దుమ్ము లేచి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సేవ్ మల్లయ్యపేట అంటూ ఆందోళనా సైతం చేపట్టారు. ఇసుక లారీలు తిరుగుతున్నప్పటికీ.. వర్షాలతో దుమ్ము లేవకుండా ఉంది. ఎండలు కాస్తే మరలా యథాస్థితి తప్పదు. స్థానికుల కష్టాలు మామూలే. రోడ్లపై గోతులను పూడ్చించి, మరమ్మతులు చేయించాల్సిన ప్రజాప్రతినిధులు పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇసుక తవ్వకాలపై వచ్చే అనధికార సొమ్ముపై ఉన్న శ్రద్ధ.. రోడ్లకు మరమ్మతులు చేయించడంపై లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా రోడ్లను పర్యవేక్షించే ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సైతం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్‌అండ్‌బీ రోడ్లపై గోతులను పూడ్చించే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నరకప్రాయంగా..



కాతేరు గ్రామంలోని ఆర్ అండ్‌బీ రోడ్లపై ఉన్న గోతులు వాహనచోదకులకు నరకప్రాయంగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై గోతులను వెంటనే పూడ్చించాలి.

– మద్దాల దుర్గారావు, కాతేరు

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



ఎస్ఈ తిలక్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల కురుస్తున్న వర్షాల దృష్ట్యా విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కె.తిలక్‌కుమార్ హెచ్చరించారు. వర్షాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను మంగళవారం ఓ ప్రకటనలో వివరించారు. వర్షాల వేళ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎలక్ట్రిక్ తీగలు, ఇతర పరికరాల వద్ద గుమిగూడరాదన్నారు. తడి చేతులతో ఎలక్ట్రిక్ స్విచ్ ఆన్/ఆఫ్ చేయవద్దన్నారు. ఇళ్లలో తడి నేలపై ఎలక్ట్రిక్ తీగలు, పరికరాలు పడకుండా జాగ్రత్తపడాలన్నారు. వర్షాకాలంలో ఇంటి వద్ద ఇనుప రాడ్లు, సిమెంట్ రాడ్లు, టిన్ షీట్లు వంటివి బహిరంగ ప్రదేశాల్లో ఉంచరాదన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగి పడి ఉంటే, వాటిని తాకకుండా.. వెంటనే 1912 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. వర్షంలో తెగి పడిన తీగలు, చెట్లపై పడి ఉన్నా, వాహనాలపై పడి ఉన్నా దగ్గరగా వెళ్లరాదన్నారు. ఇళ్లలో ఎలక్ట్రిక్ పరికరాలు వాడిన తర్వాత స్విచాఫ్ చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. వర్షపు నీటితో నిండిన ప్రదేశాల్లో, పొలాల్లో, రోడ్లలో ఉన్న ఎలక్ట్రిక్ లైన్ల సమీపంలో సంచరించరాదన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాల వద్ద గుడారాలు, షెడ్లు, టెంట్లు ఏర్పాటు చేయరాదన్నారు. పిల్లలు ఎలక్ట్రిక్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆటలాడరాదన్నారు. వర్షాకాలంలో ఇంటి లోపలికి వచ్చే కరెంట్ షాక్‌లను నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్ తీగలు, స్విచ్‌లను తాకరాదని, మోటార్ వాడకాన్ని తగ్గించాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ 1912 నంబర్‌కి కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న శ్రీలక్ష్మి



కార్యక్రమానికి హాజరైన మహిళలు, వివిధ శాఖల సిబ్బంది

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

కడియం: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో పౌరుల సాధికారతపై మౌలిక స్థాయి అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం, బాల్య వివాహాల నిర్మూలన, పీసీఆర్ చట్టం, ఎస్సీ/ఎస్టీ పీఓఏ చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఎంపీడీవో కె.రమేష్, ఎస్సై లక్ష్మీప్రసన్న తమ శాఖల పరిధిలోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, న్యాయవాదులు, న్యాయ సేవ సిబ్బంది, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, వెలుగు ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజలకు వివరించాలి

- శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స
- వైఎస్సార్ సీపీ శ్రేణుల ఘన స్వాగతం

రాజమహేంద్రవరం రూరల్: అనేక రకాలుగా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్, రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం బొమ్మూరులోని పార్టీ కార్యాలయం వద్ద ఆయనకు ఘన స్వాగతం లభించింది. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం బొత్స సత్యనారాయణ పార్టీ రూరల్ నియోజకవర్గ శ్రేణులతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు(బాబు), కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, చెల్లిబోయిన నరేన్, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి తిరుమలశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి రేలంగి వీరవెంకట సత్యనారాయణ, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మీర్జా మౌలా ఆలీ, రాష్ట్ర మహిళా కార్యదర్శి అంగాడి సత్యప్రియ, జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, జిల్లా అధికార ప్రతినిధి పెయ్యల రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, జిల్లా కోశాధికారి యెజ్జు వాసు, వివిధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు చీకురుమల్లి చిన్న, పడాల వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రూరల్ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

ఫొటోగ్రఫీ అనేది కళారూపం

- గోదావరి బెస్ట్ ఫొటో జర్నలిస్ట్ అవార్డుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్సీ వీర్రాజు
- 'సాక్షి' సీనియర్ ఫొటోగ్రాఫర్ ప్రసాద్‌కు అవార్డు

రాజమహేంద్రవరం రూరల్: కేవలం చిత్రాలను బంధించే సాధనం మాత్రమే ఫొటోగ్రఫీ కాదని, అది ఓ కళారూపమని, జ్ఞాపకాలను భద్రపర్చే మార్గమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజ యోనా ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్సీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'సాక్షి' సీనియర్ ఫొటోగ్రాఫర్ జీవీవీ ప్రసాద్, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ ఎస్‌బీ రాజేశ్వరరావుకు గోదావరి బెస్ట్ ఫొటో జర్నలిస్ట్ అవార్డులతో ఎమ్మెల్సీ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సామాజిక స్పృహతో స్పందించి, ప్రజా సమస్యలను ఎత్తిచూపి, సమాజ శ్రేయస్సుకు కృషి చేసే వ్యక్తులు ఫొటో జర్నలిస్టులన్నారు. ప్రపంచాన్ని అర్థం చేసుకునే శక్తివంతమైన మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర నాయకుడు మండెల శ్రీరామమూర్తి, ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, పిన్నమనేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ ఫొటోగ్రాఫర్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

డ్రగ్స్ వ్యాపారుల అక్రమాస్తులు స్వాధీనం

- ఏపీ ఈగల్ చీఫ్ రవికృష్ణ
- సెంట్రల్ జైలు సందర్శన

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): మత్తు పదార్థాల వ్యాపారం నుంచి ఆదాయం పొందే వారిపై కఠిన ఆర్థిక విచారణ చేపట్టి, అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని ఏపీ ఈగల్ చీఫ్, ఐజీపీ ఆకే రవికృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును మంగళవారం ఆయన సందర్శించారు. జైలులోని వివిధ విభాగాలను పరిశీలించారు. గంజాయి, నిషేధిత డ్రగ్స్‌పై ఇక నేరాలు చేయబోమని ఖైదీలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ, ఎన్‌డీపీఎస్ చట్టం–1985 ప్రకారం డ్రగ్స్ అక్రమ రవాణా, నిల్వ, విక్రయం మాత్రమే కాకుండా, వాటి ద్వారా పొందిన అక్రమ ఆర్థిక లావాదేవీలను కూడా విచారణ చేస్తారని వివరించారు. ఈ క్రమంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వ్యాపారంలో నిమగ్నమైన వ్యక్తులు, వారి సంబంధీకుల బ్యాంక్ ఖాతాలు, స్థిరాస్తులు, వాహనాలు, ఇతర ఆర్థిక వనరులపై దర్యాప్తు చేసి, అక్రమ సొమ్మును గుర్తించి, సంబంధిత ఆస్తులను సీజ్ చేస్తామని వివరించారు. మనీ ట్రయల్‌ను అనుసరించి అక్రమ లావాదేవీలను బయటపెడతామని, డ్రగ్స్ మాఫియాను మూలాలు సహా నిర్మూలించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఎన్‌సీబీ, ఎక్సైజ్, ఇతర ఏజెన్సీలతో సమన్వయం చేస్తున్నామన్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, వ్యాపారంలో నిమగ్నమయ్యే వ్యక్తులపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ చట్టం ప్రకారం మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలపై నేరపూరిత కార్యకలాపాల్లో పాల్గొనే వారిని ఏడాది పాటు నిర్బంధంలో ఉంచే అధికారం పోలీసు విభాగానికి ఉందన్నారు. ముద్దాయిలు భవిష్యత్తులో మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉండి, సమాజంలో మంచి పౌరులుగా మారాలన్నారు. అనంతరం జైలు అధికారులతో చర్చించి, ఖైదీల పునరావాసానికి కౌన్సెలింగ్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ కె.నగేష్‌బాబు, జైలు సూపరింటెండెంట్ రాహుల్, ఈగల్ ఇన్‌స్పెక్టర్ పీవీ సూర్యమోహనరావు, రాజమండ్రి, కాకినాడ, కోనసీమ జిల్లాల ఈగల్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న ఏపీ ఈగల్ చీఫ్ రవికృష్ణ

జీవన దృక్పథమే మానవత్వం

సీటీఆర్ఐ: మానవత్వం అంటే తత్వమని, మతం కాదని అది ఓ జీవన దృక్పథమని మానవత స్వచ్ఛంద సంస్థ ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు కండెపు వెంకట సూర్యనారాయణ అన్నారు. ప్రపంచ మానవత దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మానవత, ఎకో క్లబ్ సంయుక్తాధ్వర్యంలో దాదాపు వంద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, మనిషికి ప్రకృతికి మధ్య ఉన్న ఐక్యతను సాధించడానికి ఉపయోగపడే సాధనమే మానవత్వమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపణ్యం మాట్లాడుతూ, మనిషిలోని సహనం, సామాజిక శాంతికి కారణమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి తత్వాన్ని అర్థం చేసుకోగలిగితే జీవితమే సుఖమయం అవుతుందన్నారు. మానవత పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ తాడేపల్లి మోహనరావు మాట్లాడుతూ, పరస్పర ప్రేమ, భూతదయతో చుట్టూ ఉన్న వాటిని కాపాడుకోవడమే మానవత్వానికి అసలైన అర్థమన్నారు. మానవత రాజమండ్రి శాఖ చైర్మన్ సీపీ రెడ్డి మాట్లాడుతూ, ఏ మతంలోనైనా, ఏ గ్రంథమైనా కోరుకునేది మానవత్వాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మానవత రాజమండ్రి కన్వీనర్ గాంధీ మాస్టర్, అధ్యక్షుడు బి.మురళి, కార్యదర్శి కె.విశ్వనాథ్, పర్యావరణ సంరక్షణ కమిటీ చైర్మన్ ధర్మారెడ్డి, వైస్ చైర్మన్ ఎ.శ్రీనివాసరావు, జిల్లా కన్వీనర్ కె.గంగాధర్, వైస్ ప్రెసిడెంట్ కె చంద్రయ్య, అధ్యాపకులు డాక్టర్ పీవీబీ సంజీవరావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మానవత సభ్యులు

పౌర హక్కులపై అవగాహన అవసరం

రంగంపేట: రాజ్యాంగ పరంగా పౌరుల హక్కులపై అవగాహన పెంచుకోవడంలో విద్యార్థులు చైతన్యవంతులు కావాలని మన హక్కులకై పోరాడు సాధించు ఉద్యమ సంస్థ ఇండియన్ యాక్ట్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ ఉత్తరాంధ్ర రీజినల్ చైర్మన్ కోడి తాతారావు అన్నారు. మంగళవారం చంద్రేడు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం గంటా రమణబాబు అధ్యక్షతన సంస్థ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై బ్రోచర్లను సీఆర్ఎంటీ శ్రీనివాసరాజు, ఉపాధ్యాయుడు వీరబాబు విడుదల చేశారు. అనంతరం తాతారావు మాట్లాడుతూ, హక్కులు సాధించడంలో పోరాట పటిమను పెంచుకోవాలని కోరారు. పాఠ్యాంశాల్లో ఉన్న చట్టాలతో పాటు, సమాచార హక్కు చట్టం వంటి వాటిపై అవగాహన అవసరమన్నారు. విద్యార్థులకు సమాచార చట్టంపై ముద్రించిన బ్రోచర్లను పంపిణీ చేశారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి జాతర

అనపర్తి: తూర్పు కాపుల ఇలవేల్పు, గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారం రామవరంలో ఘనంగా జరిగింది. శక్తివేషాలు, డప్పులు కోలాహలం మధ్య అమ్మవారి గరగలతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి జాతర నేపథ్యంలో వృత్తి రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉంటున్న స్థానికులు, బంధువులు, స్నేహితుల రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.



జాతర సందర్భంగా ఊరేగుతున్న శక్తి వేషధారులు

పైడితల్లి చరిత్ర

తరతరాల క్రితం విజయనగరం పరిసర ప్రాంతాల నుంచి తూర్పు కాపు సామాజిక వర్గీయులు రామవరం గ్రామానికి వలస వచ్చారు. ఇలా గ్రామానికి వచ్చిన వారు సామాజికంగాను, ఆర్థికంగాను పురోగతి సాధించడంతో పైడితల్లి అమ్మవారి చల్లని దీవెనలే కారణమనేది నమ్మకం. క్రమం తప్పకుండా అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. తూర్పు కాపు వర్గీయులే కాకుండా, గ్రామస్తులంతా అమ్మవారి దీవెనల కోసం భక్తిప్రపత్తులతో కొలుస్తారు. గ్రామ దేవతగా భావించి గ్రామస్తుల సహకారంతో నూతన ఆలయాన్ని కూడా నిర్మించారు. అమ్మవారి జాతరకు, ఆలయ నిర్మాణానికి అందరి సహకారం మరువలేనిదని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆదాడి చినసత్యనారాయణ తెలిపారు.

సెల్ టవర్ వద్దని ఆందోళన

కోరుకొండ: గ్రామంలోని శివాలయం వెనుక భాగంలో ప్రముఖ సెల్ కంపెనీ టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు ఆందోళన చేపట్టారు. దానిలో భాగంగా మంగళవారం కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతం స్థానికులతో సమావేశాన్ని నిర్వహించారు. సెల్ టవర్ ఉంటే రేడియేషన్ వ్యాప్తి చెంది, స్థానికులకు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని వాపోయారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రజల కోరికలను కలెక్టర్ ప్రశాంతికి అందజేస్తామన్నారు. ఈ సమస్యపై ఇటీవల స్థానికులు కలెక్టర్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. తహసీల్దార్‌ని ఆ ప్రదేశం పరిశీలించి, నివేదికను అందించాలని ఆదేశించారు. టవర్ ఏర్పాటు పనులను ఆపాలని, లేదంటే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మందా బాలకృష్ణ, కాపవరపు వెంకటేశ్వర రావు, జి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



సెల్ టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న వారితో మాట్లాడుతున్న తహసీల్దార్

జీజీయూలో సెమినార్

రాజానగరం: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో ఈ నెల 22, 23 తేదీలలో ఆటోమెటివ్‌లో ప్రత్యామ్నాయ ఇంధనంగా హైడ్రోజన్ ప్రాముఖ్యత అనే అంశంపై జాతీయ సెమినార్ జరగనుంది. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఛాన్సలర్ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ప్రొ ఛాన్సలర్ కె.శశికిరణవర్మ, వీసీ చంద్రశేఖర్ మంగళవారం విడుదల చేశారు.